
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
సోమవారం 7 ఏప్రిల్ 2025



నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

కమనీయం.. రాములోరి కల్యాణం

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- ఉదయం కల్యాణోత్సవం.. సాయంత్రం గ్రామోత్సవం
- మార్మోగిన రామనామస్మరణ



కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. భక్తి ప్రపత్తులతో జై శ్రీరాం నినాదాల నడుమ ఒక్కో ఘట్టం కమనీయంగా సాగింది. తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన నవమి వేడుకలు కల్యాణోత్సవం, తలంబ్రాల తంతు వరకు వైభవంగా సాగాయి. జీలకర్ర బెల్లం ఘట్టం, మంగళసూత్రధారణ, తలంబ్రాలను చల్లుకునే వేడుకలను చూసి భక్తులు పులకించారు. కల్యాణోత్సవాన్ని ఆద్యంతం భక్తులు చూసి ఆనంద పరవశులయ్యారు. చలువ పందిళ్ల కింద కూర్చొని సీతమ్మతల్లి, రామచంద్రమూర్తుల కల్యాణ ఘట్టాన్ని ఆద్యంతం వీక్షించారు. వేద పండితులు శాస్త్రోక్తంగా, పెళ్లి మంత్రాల పఠిస్తుండగా, కల్యాణ తంతును వీనుల విందుగా ఆలకిస్తూ తరించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల అక్షితలను అర్చకులతో తలపై చల్లించుకోని, నైవేద్యంగా పెట్టిన వడపప్పు, పానకం, పండ్లను భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. నగరంలోని శ్రీదామోదరం సంజీవయ్య స్మారక నగరపాలక మున్సిపల్ హైస్కూల్ క్రీడామైదానంలో భారీ వేదికపై సీతారాముల కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ పట్టువస్త్రాలను సమర్పించారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న తుగ్గలి నాగేంద్ర దంపతులు









కర్నూలులోని చౌరస్తా హనుమాన్ దేవాలయంలో



కర్నూల్లో సీతారాముల కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



ధర్మపేటలోని రామాలయంలో...



కర్నూలు నగరంలోని ఓల్డ్‌సిటీలో ఉన్న రాంభొట్ల ఆలయంలో సీతారాముల కల్యాణ వేడుకలు వైభవంగా సాగాయి. టీటీడీ వేద పండితుడు జీవీ కమలసాయినాథ శర్మ నేతృత్వంలో, శాస్త్రోక్తంగా అభిజిత్ లగ్నంలో కల్యాణ వేడుకను నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పాల్గొన్నారు. తుంగభద్ర నది ఒడ్డున వెలసిన సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో శ్రీరామనవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులకు పానకం, ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్, కార్యదర్శి చల్లా నాగరాజశర్మ పాల్గొన్నారు. బళ్లారి చౌరస్తాలోని హనుమాన్ ఆలయంలో ఆలయ ఈవో పి. దినేష్ ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి.



పాతనగరంలోని రాంబొట్ల దేవాలయంలో పూజలు చేస్తున్న రాష్ట్ర మంత్రి టీజీ భరత్

తుగ్గలి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తుగ్గలి మండల కేంద్రంలో సీతారాముల కల్యాణోత్సవం, రథోత్సవం ఆదివారం కమనీయంగా సాగింది. రాములోరికి రూ.15లక్షలతో చేయించిన నూతన రథాన్ని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి ఆయన సతీమణి కేఈ పద్మావతి, ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, గుమ్మనూరు జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి ప్రారంభించారు. మేళతాళాలతో, తలంబ్రాలు, తాలిబొట్లు, పట్టువస్త్రాలను తీసుకువచ్చి తుగ్గలి నాగేంద్ర దంపతుల చేతుల మీదుగా కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

తుగ్గలిలో రామమయం

- సీతారాముల రథం ప్రారంభం

సాయంత్రం వేలాదిమంది భక్తుల నడుమ రథోత్సవం వైభవంగా సాగింది. ఇదిలా ఉండగా రథోత్సవం సందర్భంగా తుగ్గలిలోని 2,500 మంది మహిళలకు పసుపు,కుంకుమతో పాటు పట్టు చీరలను తుగ్గలి నాగేంద్ర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతుల సురేష్, కేఈ జయన్న, వైకుంఠం శివప్రసాద్, జ్యోతి, మిద్దె వెంకటేష్ యాదవ్, సర్పంచ్ రవి, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



వేలాదిమంది భక్తుల నడుమ కొనసాగుతున్న రథోత్సవం

పల్లె రోడ్డుకు మహర్దశ..!



సీఎం చంద్రబాబు సారధ్యంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత గ్రామీణ, పట్టణ రహదారులకు మహర్దశ వచ్చింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గంపెడు మట్టి కూడా వేయకపోవడంతో గుంతలు గుంతలుగా దర్శనమిస్తున్నాయి. ప్రయాణం నరకప్రాయంగా మారింది. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన తక్షణమే తాత్కాలిక మరమ్మతులు చేపట్టి వాహనదారులకు ఉపశమనం కల్పించారు. తాజాగా శాశ్వత మరమ్మతులపై దృష్టి సారించారు. ప్రాధాన్యత క్రమంలో రాష్ట్రంలో 220 రోడ్ల మరమ్మతులకు రూ.600 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగానే ఉమ్మడి కర్నూలు జిల్లాలో రోడ్లు భవనాలు శాఖ పర్యవేక్షణలోని కర్నూలు జిల్లాలో ఐదు రోడ్లకు రూ.10.10 కోట్లు, నంద్యాల జిల్లాలో ఏడు రోడ్లకు రూ.15.80 కోట్లు కలిపి రూ.25.90 కోట్లు నిధులు మంజూరు చేశారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు చేపడుతామని రోడ్లు, భవనాల శాఖ ఇంజనీర్లు వెల్లడించారు.

కౌతాళం-హల్వి ప్రధాన రోడ్డు దుస్థితి. దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోక గుంతలమయంగా మారింది. ఎట్టకేలకు ప్రభుత్వం రూ.2.30 కోట్లు మంజూరు చేసింది.

- రహదారుల మరమ్మతులపై ప్రభుత్వం దృష్టి
- ఉమ్మడి జిల్లాకు రూ.25.9 కోట్లు మంజూరు
- కర్నూలు జిల్లాలో రూ.10.10 కోట్లతో అభివృద్ధి
- కౌతాళం-హాల్వి రోడ్డుకు మోక్షం



కర్నూలు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ప్రాధాన్యత క్రమంలో పాణ్యం నియోజకవర్గం పరిధిలో చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారి 353/5 కి.మీ నుంచి 355/7 కిలోమీటర్ల వరకు 2.200 కిలోమీటర్లు అధ్వానంగా మారింది. శాశ్వత మరమ్మతులకు రూ.3.50 కోట్లు మంజూరు చేశారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో కలుగోట్ల-పార్లపల్లి రోడ్డు 0/00 కి.మీల నుంచి 5.130 కి.మీల వరకు, కైరవాడి నుంచి టి.సోమలగూడూరు వెళ్లే ప్రధాన రహదారి 15.00 కి.మీల నుంచి 24.900 కి.మీల వరకు, బనవాసి ఫారం నుంచి ఆదోని-ఎమ్మిగనూరు రోడ్డు వయా మల్కాపురం, కోటేకల్లు రోడ్డు 0.00 నుంచి 1.00 కి.మీల వరకు, నుంకేసుల-నాగులదిన్నె రోడ్డు 25.420 కి.మీల నుంచి 28.200 కి.మీల వరకు ఈ నాలుగు రోడ్లలో 18.810 కి.మీలు మరమ్మతులకు రూ.1.50 కోట్లు మంజూరు చేశారు. అలాగే మంత్రాలయం నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని కౌతాళం-హల్వి రోడ్డుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. గుంతలు పడి అధ్వానంగా మారిన ఈ రోడ్డు 9/2 నుంచి 13/8 కి.మీల వరకు 4.60 కి.మీలు పూర్తిగా దెబ్బతిన్న రహదారి మరమ్మతులకు రూ.2.30 కోట్లు ఇచ్చారు. ఆదోని నియోజకవర్గంలో గుంతకల్లు-తుంగభద్ర (జీటీబీ) రహదారి 58/8 నుంచి 59/4 కి.మీలు వరకు, 62/6 నుంచి 65/0 కి.మీల వరకు, హానవాల్ నుంచి కుంటనహాల్ రోడ్డు 4/0 నుంచి 8/0 కి.మీలు వరకు 7.60 కి.మీల మరమ్మతులకు రూ.2.10 కోట్లు, ఆదోని-సిరిగుంప రోడ్డు 15/0 నుంచి 18/0 కి.మీల వరకు, 24/0 నుంచి 26/7 కి.మీల వరకు మొత్తం 5.70 కిలో మీటర్ల మరమ్మతులకు రూ.3.50 కోట్లు మంజూరు చేశారు. జిల్లాలో ఐదు పనులకు 39.91 కిలో మీటర్లు మరమ్మతులకు రూ.10.10 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నంద్యాల జిల్లాకు రూ.15.80 కోట్లు

రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి నంద్యాల జిల్లాకు చెందిన వ్యక్తి కావడంతో రోడ్ల మరమ్మతుల నిధులు మంజూరు చేయడంతో ఆ జిల్లాకు ప్రాధాన్యత ఇచ్చారు. శ్రీశైలం నియోజవకర్గంలో ఆత్మకూరు-కొట్టాలచెరువు రోడ్డు 1/7 - 7/6 కి.మీల వరకు 5.90 కి.మీలకు రూ.1.50 కోట్లు, రేగలగూడూరు - పాములపాడు రోడ్డు 0/0 నుంచి 5/2 కి.మీల వరకు రూ.2.20 కోట్లు, ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఉయ్యాలవాడ-సుద్దమల్ల రోడ్డు 0/0 - 4/0 కి.మీల వరకు రూ.కోటి, ద్రొరిపాడు - యల్లూరు రోడ్డు 8/5 - 12/5 కి.మీల వరకు రూ.1.50 కోట్లు మంజూరు చేశారు. డోన్ నియోజకవర్గంలో సిమెంట్‌నగర్ - రామతీర్థం రోడ్డు 0/0 - 6/0 కి.మీల వరకు రూ.2.10 కోట్లు, పాణ్యం నియోజకవర్గం నందివర్గం-ఎస్.కొత్తూరు రోడ్డు 5/6 - 10/6 కి.మీల వరకు మరమ్మతులకు రూ.2.50 కోట్లు, నంద్యాల నియోజకవర్గం పరిధిలో చిత్తూరు-కర్నూలు (సీకే) జాతీయ రహదారి 281/300 - 284/00 కి.మీల వరకు, నంద్యాల బైపాస్ రోడ్డు 0/0 నుంచి 2/515 కి.మీల వరకు 5.215 కిలో మీటర్లు మరమ్మతులకు రూ.3 కోట్లు, సంజీవనగర్ నుంచి ఆత్మకూరు బస్టాండ్ వరకు 800 మీటర్ల మేర రహదారి నిర్మాణానికి రూ.4.50 కోట్లు మంజూరు చేశారు.



కౌతాళం-హల్వి రోడ్డులోని కల్వర్టు దుస్థితి ఇది

కళ్లు నెత్తికెక్కాయా..?

- బుద్ధి ఉందా? గాడిదలు కాస్తున్నారా?
- అధికారులపై ఎమ్మెల్యే పార్థసారథి ఆగ్రహం
- రామాలయం వద్ద అపరిశుభ్రతపై అసహనం



పారపట్టి చెత్తను తొలగిస్తున్న చేసిన ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): 'బుద్ధి ఉండక్కర్లేదా.. కళ్లు నెత్తికెక్కాయా.. మీరేమైనా గాడిదలు కాస్తున్నారా..' ఇవేవో సాధారణ వ్యక్తులు మాట్లాడిన మాటలు కావవి. చిరు ఉద్యోగులపై ఆగ్రహంతో ఆదోని ఎమ్మెల్యే ఆగ్రహ మాటలు. ఆదోని మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో శ్రీరామనవమి వేడుకలకు ఎమ్మెల్యే పార్థసారథి హాజరయ్యారు. అయితే రామాలయం సమీపంలో చెత్తా, చెదారం తొలగించకపోవడం, అపరిశుభ్రతను ఎమ్మెల్యే గమనించారు. దీంతో ఆయన అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. స్వయంగా ఎమ్మెల్యే పారచేత పట్టి రామాలయం దగ్గర ఉన్న చెత్తను తొలగించారు. ఒకవైపు గ్రామ కార్యదర్శి మల్లికార్జున, డీఎల్‌పీఓ, ఎంపీడీఓ, స్థానిక ఎస్‌ఐ ఒక్కొక్కరు ఒక్కోరకంగా చెప్పడంతో నలుగురు అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా తాను వస్తున్నానని తెలిసి కూడా ఇంత నిర్లక్ష్యం చేస్తున్న అధికారులను ఏమనాలి అంటూ అసహనం వ్యక్తం చేశారు. అధికారులు మధ్య సమన్వయలోపం కారణంగానే ఇలా జరిగిందన్నారు. 'పిచ్చిపిచ్చిగా వ్యవహరిస్తే బాగుండదు. ఎమ్మెల్యే వస్తున్నా కూడా ఇక్కడ లేకుండా వెళ్లిపోవడం ఏమిటి? నీ పని పద్ధతిగా లేదు. మార్చుకుంటే ఉండం డి. లేకపోతే ఇక్కడి నుంచి వెళ్లిపోం డి. గాడిదలు కాస్తున్నారా..' అంటూ ఎమ్మెల్యే హెచ్చరించారు. శ్రీరామ నవమి ఉత్సవం ఉన్నప్పుడు నలుగురు అధికారులు ఒకరి పై ఒకరు నెట్టుకోవడం ఏమి టని ఎస్‌ఐపై మండి పడ్డారు. ఇక్కడ శుభ్రం అయ్యేం తవరకు దేవాల యం దగ్గర నుంచి వెళ్లేదే లేదని అర్ధరాత్రి వరకు ఎమ్మెల్యే అక్కడ ఉండిపోయారు. అనంత రం ప్రొక్లెయినర్ సాయంతో రామాలయం వద్ద శుభ్రపరిచాక ఎమ్మెల్యే రాములోరికి పట్టు వస్త్రా లను సమర్పించి అక్కడి నుంచి వెళ్లారు.

డీఈవో కార్యాలయ ఏడీపై విచారణ

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ (ఏడీ-1) ఏ. శ్రీనివాసులు మీద వచ్చిన ఆరోపణలపై విచారణ కమిటీ ఆదివారం స్థానిక తాండ్రపాడు క్రేడో ఇంగ్లీషు మీడియం పాఠశాలలో విచారణ జరిపింది. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మహిళా ఉద్యోగులను ఏడీ ఏ.శ్రీనివాసులు వేధింపులకు గురి చేశారనే ఆరోపణలు రావడంతో వారు డీఈవో శామ్యూల్‌పాల్ దృష్టికి తీసుకువచ్చారు. అయితే ఈ విషయం బయటకు తెలియకుండా జాగ్రత్తలు పడ్డారు. ఇటీవల బైటపడ్డాక కడప ఆర్జేడీ శామేల్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లాకు చెందిన సర్వశిక్ష అభియాన్ ఏఎంవో లలిత కుమారి, జీసీడీవో నాగ సులోచనలను విచారణ అధికారులుగా నియమించారు. కడప ఆర్జేడీ శామేల్ ఆధ్వర్యంలో ఆదివారం బాధిత మహిళా ఉద్యోగినులతో పాటు డీఈవో కార్యాలయ ఉద్యోగులు, అధికారులను కమిటీ సభ్యులు విచారణ చేశారు. అనంతరం ఒక నివేదికను తయారు చేసి కడప ఆర్జేడీ శామేల్‌కు నివేదికను అందజేస్తామన్నారు.



కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక



ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు




కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు



రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

ఆత్మకూరులో గాలివాన

- పెనుగాలుల ధాటికి విరిగిపడిన మామిడి వృక్షాలు
- క్వింటాళ్ల కొద్ది రాలిపడిన మామిడి కాయలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు



గాలివాన బీభత్సానికి విరిగిపడిన మామిడి వృక్షం

ఆత్మకూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులో ఆదివారం మధ్యాహ్నం గాలివాన బీభత్సం సృష్టించాయి. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. పెనుగాలులు వీచడంతో ఆత్మకూరు పట్టణంతో పాటు చుట్టుపక్కల గల పలు గ్రామాల్లోని మామిడి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. బలమైన గాలుల ధాటికి పలు చోట్ల మామిడి వృక్షాలు నేలకూలగా క్వింటాళ్ల కొద్ది మామిడి కాయలు నేలరాలి తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ఏడాదంతా ఎంతో కష్టపడి కంటికి రెప్పలా పంటను కాపాడుకుంటే చివరికి గాలివాన బీభత్సానికి మామిడి కాయలన్నీ రాలిపోవడంతో లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. వాస్తవానికి ఈ ఏడాది మామిడి దిగుబడులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కొద్దోగొప్పో దిగుబడులు చేతికొచ్చే సమయానికి ప్రకృతి ప్రకోపానికి మామిడి కాయలు బలై దెబ్బతినడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యానశాఖ అధికారులు దెబ్బతిన్న మామిడి తోటలను సందర్శించి నష్టపరిహారాన్ని అంచనా వేసి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.



పంటంతా రాలిపడిన మామిడి కాయలు

10క్వింటాళ్లకు పైగా మామిడి కాయలు నేలరాలాయి



ఆత్మకూరు మండలంలోని కురుకుంద గ్రామంలో మూడు ఎకరాల మామిడి తోటను కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాను. సుమారు రూ.4లక్షల వరకు పంట సస్యరక్షణ చర్యలకు ఖర్చు చేశాను. ప్రస్తుతం మధ్య సైజులో మామిడి కాయలు ఉన్నాయి. ఆదివారం పెనుగాలుల ధాటికి తోటలోని 16ఏళ్ల నాటి మామిడి వృక్షాలు నేలకొరిగాయి. 10క్వింటాళ్లకు పైగా మామిడి కాయలు నేలరాలాయి. రూ.3లక్షలకు పైగా నష్టం సంభవించింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

- మోహబతుల్లా, మామిడి రైతు, ఆత్మకూరు

ఆత్మహత్యాయత్నం చేసిన రైతు కుటుంబం

ప్రాణాపాయస్థితిలో బాధితులు

పాములపాడు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అప్పులపాలైన ఓ రైతు తన భార్యా పిల్లలకు, తల్లికి పురుగుల మందుతాపి, తాను తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని ఇస్కాల గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన గొల్ల సోమేశ్వరుడు అనే రైతు గత కొన్ని ఏళ్ళుగా దాదాపు 20 ఎకరాల పొలం కౌలుకు తీసుకొని పత్తి, మిరప, పొగాకు, మొక్కజొన్న పంటలను సాగుచేసి అప్పులపాలయ్యాడు. దీంతో గత మంగళవారం రాత్రి కుటుంబసభ్యులకు తెలియకుండా కూల్ డ్రింక్‌లో పురుగుల మందు కలిపి ఇచ్చి, తాను తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆ రోజు రాత్రి నుంచి సోమేశ్వరుడికి, కుటుంబసభ్యులందరికీ వాంతులు విరేచనాలు అవుతుండటంతో బంధువులు పాములపాడు ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. ఆ తర్వాత ఆత్మకూరుకు, కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో డాక్టర్లు గద్దించి అడిగిన మీదట సోమేశ్వరుడు.. అసలు విషయం చెప్పాడు. బాధితులను తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీవో చంద్రశేఖర్ కలిసి వివరాలను అడిగి తెలుసుకొన్నారు.

డీబీసీ డబ్ల్యూవోగా ప్రసూన నియామకం

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారిగా కే. ప్రసూనను నియమిస్తూ బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. బీసీ సంక్షేమ శాఖలో ఇటీవల జరిగిన పదోన్నతుల్లో భాగంగా నెల్లూరు జిల్లాలో సహాయ బీసీ సంక్షేమ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ప్రసూనకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిత అధికారిగా పదోన్నతి కల్పిస్తూ పోస్టింగ్ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని కొటేకల్లు గ్రామ క్రాస్ రోడ్డు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎమ్మిగనూరు వైపు వస్తున్న మినీ లారీ టైర్లు పగిలిపోవడంతో ఎదురుగా వస్తున్న స్కార్ పియో వాహనానికి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కార్‌పియో వాహనాన్ని నడుపుతున్న కోసిగి మండలం దుద్ది గ్రామానికి చెందిన ప్రహ్లాద(30) అక్కడిక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న మంగమ్మ అనే మహిళకు గాయాలు కావడంతో ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేసినట్లు పోలీసులు తెలిపారు. రూరల్‌ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

ఆస్పరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ములు గుదం గ్రామ సమీపంలో తెర్నకల్లుకు చెందిన మతిస్థిమితం లేని ఉప్పర ఉమాపతి (30)అనే వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు సీఐ మస్తాన్వలి ఆదివారం తెలిపారు. మృతు డికి భార్య సుజాత, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

ఇంటి పైకప్పు కూలి ఒకరి మృతి

నంద్యాల క్రైం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంజుమన్ వీధిలో ఓ ఇంటి పైకప్పు కూలి మీదపడటంతో ఒక వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. అంజుమన్ వీధిలో నివసిస్తున్న షేక్ రఫీఅహమ్మద్ (54) అనే వ్యక్తి రాత్రి తన మిత్రుడి ప్రథమచికిత్స కేంద్రం వద్ద మిత్రులతో మాట్లాడుతుండగా ప్రథమ చికిత్స కేంద్రం పైకప్పు మీద ఉన్న గోడ కూలి రఫీ అహమ్మద్‌పై పడింది. తలకు బల మైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మరణించినట్లు ధృవీకరించారని పోలీ సులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

ముస్లింలను మభ్యపెట్టేందుకు వైసీపీ కుట్రలు

- మంత్రి టీజీ భరత్‌పై తప్పుడు ప్రచారం
- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వాహీద్ హుస్సేన్



సమావేశంలో ఐక్యత చాటుతున్న ముస్లిం నాయకులు

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ముస్లింలను మభ్యపెట్టేలా వైసీపీ కుట్ర రాజకీయాలకు పాల్పడుతోందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వాహీద్ హుస్సేన్ పేర్కొన్నారు. కర్నూలులో ముస్లింలకు మంత్రి టీజీ భరత్ అండగా ఉంటున్నారని, ఆయనపై తప్పుడు ప్రచారాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. ఆదివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మైనార్టీ విభాగం నాయకులు విలేకరులతో మాట్లాడారు. వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా మంత్రి టీజీ భరత్‌పై వైసీపీ నాయకుడు ఆఫ్జాద్ ఆలీఖాన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. సీఏఏ, ఎన్‌ఆర్‌సీ విషయంలో ముస్లింలకు మద్దతుగా నిలుస్తామని టీజీ భరత్ అప్పట్లోనే స్పష్టం చేశారని తెలిపారు. ఈ బిల్లు సవరణ వల్ల ముస్లింలకు ఎప్పటికీ అన్యాయం జరగదన్నారు. వైసీపీ నాయకులు వక్ఫ్ సవరణ బిల్లును రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నారన్నారు. వక్ఫ్ బిల్లుపై వైసీపీ నీచ రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. వాస్తవాలను ప్రజల ముందుకు పెడతామన్నారు. వైసీపీ ముస్లిం నాయకులు చేతనైతే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. తెలుగుదేశం పార్టీ వక్ఫ్ సవరణ బిల్లుకు 3 సవరణలు సూచించిందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జహంగీర్ బాషా, నాయకులు హమీద్, అబ్బాస్, మన్సూర్, అలీఖాన్, ఇబ్రహీం, రబ్బాని, రమీజ్, మెహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లెల్సీలో పడి వ్యక్తి మృతి

కౌతాళం, ఏప్రిల్ 6:(మండలంలోని బదినేహల్ గ్రామం వద్ద ఎల్లెల్సీలో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. కోసిగి గ్రామానికి చెందిన ముక్కరన్న(28) కౌతాళం మండలం బదినేహల్ గ్రామానికి చెందిన శశికళను వివాహం చేసుకున్నాడు. బదినేహాల్‌లో సోమవారం జరిగే మల్లికార్జున స్వామి జాతరను తిలకించేందుకు కుటుంబంతో సహా వచ్చాడు. సాయంత్రం స్నేహితులతో కలిసి గ్రామ సమీపాన ఉన్న ఎల్లెల్సీలో ఈతకు వెళ్లి కొట్టుకుపోయాడు. స్నేహితులు గమనించి ముక్కరన్నను వెలికి తీసి ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో ఫెయిల్ అవుతానన్న భయంతో బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొలిమిగుండ్ల మండలం కోటపాడు గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గైని విక్రమ్ కుమార్తె గైని వైష్ణవి(19) కర్నూల్ నగరంలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. మూడు రోజుల క్రితం సెలవులపై ఇంటికి వచ్చిన వైష్ణవి ఆదివారం రాత్రి 9గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేరని గమనించి విషద్రావకం తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు జమ్మలమడుగు ఆసుపత్రికి తరలిస్తుండగా ఆమె మార్గమధ్యంలో మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ మద్దినేని రమేష్‌బాబు తెలిపారు.

ఫుట్‌పాత్ కార్మికులు ఈశ్రమ్‌లో నమోదు చేసుకోవాలి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఫుట్‌పాత్ కార్మికులు ఈశ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ కే.వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పేర్ల నమోదు కోసం ఈ నెల 7 నుంచి 17 వరకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు.

ఉలిక్కిపడిన గోవిందపల్లె

- హత్యాయత్నం కేసులో నిందితుల కోసం గాలింపు ముమ్మరం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఫ్యాక్షన్ జోన్ సీఐ
- పోలీసుల అదుపులో అనుమానితులు



గోవిందపల్లెలో వివరాలు తెలుసుకుంటున్న ఫ్యాక్షన్ జోన్ సీఐ

శిరివెళ్ల, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) : నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం గోవిందపల్లెలో వైసీపీ నాయకుడు ఇందూరి ప్రతాప్‌రెడ్డిపై శనివారం జరిగిన హత్యాయత్నం ఘటనతో గ్రామం ఉలిక్కిపడింది. ఈ ఘటనలో పరారీలో ఉన్న ఇద్దరు ప్రధాన నిందితుల కోసం పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ పర్యవేక్షణలో పోలీసు బృందాలు పలుచోట్ల పర్యటిస్తూ నిందితుల ఆచూకీ కోసం వివరాలు సేకరిస్తున్నారు. ఘటన జరిగిన పరిస్థితులు, దాడికి గల కారణాలపై సమగ్రంగా విచారిస్తున్నారు. ఘటన వెనుక ఎవరి ప్రమేయమైనా ఉందా? అన్న కోణంలో కూపీ లాగుతున్నారు. ఈ మేరకు నంద్యాల ఫ్యాక్షన్ జోన్ సీఐ పార్థసారథి గోవిందపల్లెలోని ఘటనాస్థలాన్ని ఆదివారం పరిశీలించారు. హత్యాయత్నం కేసు వివరాలు, గ్రామంలోని పరిస్థితులపై ఆయన ఆరా తీశారు. ఇదిలా ఉండగా గ్రామంలో పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. బాధితుడు ఇందూరి ప్రతాప్‌రెడ్డిని మెరుగైన వైద్యం నిమిత్తం తరలించారు.

జంట హత్య కేసులోనూ నిందితుడు

గోవిందపల్లె గ్రామంలో 2017, మే నెలలో జంట హత్యలు జరిగాయి. ఇందులో గంగుల కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన మాజీ ఎంపీపీ ఇందూరి ప్రభాకర్‌రెడ్డి, అతని బావ మేరువ శ్రీనివాసరెడ్డి సాయంత్రం వాకింగ్‌కు వెళ్లిన సమయంలో దుండగులు దాడి చేసి వారిద్దరినీ దారుణంగా హత్య చేశాయి. ఈ ఘటనపై శిరివెళ్ల పోలీస్ స్టేషన్‌లో 9 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ప్రతాప్‌రెడ్డిపై హత్యాయత్నం చేసిన నిందితుడు గంగదాసరి రవిచంద్రారెడ్డి.. 2017లో జరిగిన జంట హత్య కేసులోనూ నిందితుడిగా ఉన్నాడు. ఈ హత్య కేసులో ప్రతాప్‌రెడ్డి ప్రధాన సాక్షిగా ఉండడం.. ఈ నెల 21 నుంచి కోర్టులో కేసు ట్రయిల్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రతాప్‌రెడ్డిపై హత్యాయత్నం జరగడంతో పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు.

పోలీసుల అదుపులో కొందరు వ్యక్తులు

గోవిందపల్లె గ్రామంలో జరిగిన హత్యాహత్నం ఘటనలో ప్రత్యక్ష సాక్షి ఇందూరి వెంకట కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపారు. గ్రామానికి చెందిన గంగదాసరి రవిచంద్రారెడ్డి, గంగదాసరి లక్ష్మీరెడ్డి, గంగదాసరి శ్రీనివాసరెడ్డి, శిరిగిరి రమణారెడ్డితోపాటు మరో గుర్తుతెలియని వ్యక్తిపై 324, 307 రెడ్ విత్ 34 ఐపీసీ సెక్షన్ల కింద హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులుగా చేర్చిన కొందరు వ్యక్తులతోపాటు అనుమానితులను సైతం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పరారీలో ఉన్న ఇద్దరు ప్రధాన నిందితుల కోసం పోలీసులు బృందాలుగా విడిపోయి ముమ్మరంగా గాలిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

బైక్‌పై వస్తుండగా ఢీకొట్టిన దున్నపోతు ..



గుండ్ర నాగార్జున(ఫైల్)

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : పెద్ద చదువులు చదివి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తాడనుకున్న విద్యార్థి అర్ధాంతరంగా రోడ్డు ప్రమాదానికి గురై మృత్యువాత పడ్డాడు. అత్యంత విషాదకరమైన ఈ సంఘటన కొలిమిగుండ్ల మండలంలోని నందిపాడు గ్రామం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గుండ్ర నాగన్న, లక్ష్మీదేవి దంపతుల పెద్ద కుమారుడు నాగార్జున(16) ఇటీవలే పదో తరగతి పరీక్షలయ్యాక గ్రామంలో ఉంటున్నాడు. ఆదివారం పండుగ రోజు ఇప్పుడే వస్తానంటూ గ్రామ సమీపంలోని తిమ్మనాయినిపేట మెట్ట వద్దకు మోటార్‌సైకిల్‌పై వెళ్లి తిరిగి గ్రామానికి చేరుకుంటున్న సమయంలో రోడ్డు పక్కనే పొలంలో నుండి పరుగెత్తుకుంటూ వచ్చిన దున్నపోతు బైకును ఢీకొట్టింది. దున్నపోతు కొమ్ము నాగార్జున తలకు తగిలి బలమైన గాయాలు కావడంతో తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. సాధారణ రైతు కుటుంబీకులైన నాగన్న, లక్ష్మీదేవి దంపతులకు ఇరువురు కుమారులు. మృతుడు నాగార్జున బనగానపల్లెలోని నెహ్రూ పాఠశాలలో చదువుకొని, ఇటీవలే పదవ తరగతి పరీక్షలు రాశాడు. కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని యువకుడు...

నందవరం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగతి గ్రామం దగ్గర గుర్తు తెలియని లారీ అతి వేగంగా వచ్చి గొర్రెల మందను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మందలో ఉన్న గొర్రెల కాపరి కురవ లింగప్ప(20) అక్కడిక్కడే మృతి చెందాడు. మరో గొల్ల నరసప్ప, బోయ నరసప్ప, శ్రీనివాసులకు తీవ్ర గాయాలయ్యాయి. 3 గొర్రెలు అక్కడిక్కడే చనిపోగా మరో 20 గొర్రెలకు తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ కేశవ్ మాట్లాడుతూ.. ఎమ్మిగనూరులో ఆదివారం సంత కావడంతో మంత్రాలయం మీదగా ముగతి వైపు నుంచి ఎమ్మిగనూరు సంతకు దాదాపు 120 గొర్రెలను తీసుకుని గొర్రెల కాపరులు సంతకు బయలుదేరారని, ముగతి దగ్గర ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వైవిధ్యభరితమైన విమర్శ 'చెమట చెక్కిన వాక్యం'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వచ్చిన సాహిత్య విమర్శలో అరుదైన విశ్లేషణాత్మకమైన శైలి కలిగిన పుస్తకం 'చెమట చెక్కిన వాక్యం' అని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ కవి కెంగార మోహన్ రాసిన 'చెమట చెక్కిన వాక్యం' గ్రంథ పరిచయ సభ నిర్వహించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు ఈ సభకు అధ్యక్షత వహించగా, రచయిత్రి నాగమణి సభకు ఆహ్వానం పలికారు. ఈ గ్రంథాన్ని ప్రముఖ విద్యావేత్త, విశ్రాంత హెచ్‌ఎం విజయసారథి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆవిష్కర్త మాట్లాడుతూ కెంగార మోహన్ ఈ గ్రంథ ఆవిష్కరణకు తనను ఆహ్వానించడం తమ గురుశిష్య సంబంధానికి తార్కాణమని చెప్పారు. జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ ఒక విమర్శ గ్రంథం రాయడానికి వందలాది పుస్తకాలు అధ్యయనం చేయాల్సి వస్తుందని, ఇది విమర్శకుడి ప్రతిభ, ప్రజ్ఞకు నిదర్శనమని అన్నారు. విరసం రాష్ట్ర నాయకుడు పాణి మాట్లాడుతూ అరవై పుస్తకాలపై విమర్శ అన్నది సాధారణ విషయం కాదని చెప్పారు. పుస్తకంలో కవుల కవిత్వ రచన తీరు, వర్ణన, శైలి, శిల్పాలను వర్ణించడంలో కవి వైవిధ్యత ప్రదర్శించారని అభినందించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కవిగా, కథకుడిగా, విమర్శకుడిగా బహుముఖీన ప్రజ్ఞ కలిగిన కవి కెంగార మోహన్ అని అన్నారు. ప్రముఖ కథా రచయిత్రి డాక్టర్ ఎం. ప్రగతి ఇది మాట్లాడుతూ కవిత్వ అంతరంగాన్ని శోధించిన గ్రంథమని, ఈ గ్రంథం వర్తమాన కవులు చదివితే మంచి కవిత్వం రాస్తారని చెప్పారు. తెలుగు కళాస్రవంతి కార్యదర్శి ఇనాయతుల్లా మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలోని విమర్శపాత్రను ఈ గ్రంథం పూర్తి చేస్తుందని అన్నారు. ఈ సభలో సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు ఆవుల బసప్ప, గౌరవాధ్యక్షుడు ఎంపీ బసవరాజులతోపాటు పలువురు కవులు, కళాకారులు పాల్గొన్నారు.

సంగమేశ్వర క్షేత్రంలో హైకోర్టు న్యాయమూర్తి



రూపాల సంగమేశ్వర స్వామి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథరెడ్డి కుటుంబ సభ్యులు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని జగన్నాథగట్టుపై కొలువైన ఉమాసమేత రూపాల సంగమేశ్వర స్వామివారిని ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన ఆయనకు ఈఓ వై.గుర్రెడ్డి, సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారికి పంచామృతాభిషేకములు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సురేష్‌శర్మ పంచామృతాభిషేకం నిర్వహించి తీర్థ ప్రసాదాలు వారికి అందజేశారు.

నేడు కార్పొరేషన్‌లో వినతుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులను స్వీకరించ నున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో ఎక్కడైనా కాలనీల్లో స్థానిక సమస్యలు ఉంటే అర్జీలు ఇవ్వాలని కోరారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ముందస్తు పన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): నగరంలో ఆస్తి పన్నును ముందస్తుగా చెల్లించి 5 శాతం రాయితీ పొందాలని కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 అర్ధ, రెండో ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ స్థలం పన్నులను ఈ నెల 30 లోగా చెల్లిస్తే 5 శాతం పన్ను రాయితీ వర్తిస్తుందన్నారు. మే నుంచి ఎటు వంటి రాయితీ వర్తించదన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో, మీ సేవ, ఆన్‌లైన్ కేంద్రాల్లో, స్థానిక సచివాలయల్లో పన్నులు చెల్లించవచ్చన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి ఇంటర్ ఫస్ట్ ఇయర్ అడ్మిషన్లు ప్రారంభం

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో సోమవారం నుంచి ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు, బ్రిడ్జి కోర్సులు ప్రారంభమవుతాయని ప్రిన్సిపాల్ సుంకన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల ఒకటో తేదీన రెండో సంవత్సరం ఇంటర్ తరగతులు ప్రారంభమైనట్లు తెలిపారు. వారికి పాఠ్యపుస్తకాలు కూడా ఇస్తామన్నారు. ప్రథమ సంవ త్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ, ఎంబైపీసీ కోర్సుల్లో తెలుగు, ఇంగ్లీషు మీడియాలలో చేరాలనుకునే వారు త్వరపడాలన్నారు. అదేవిధంగా ఒకేషనల్ కోర్సుల గ్రూపులు కూడా ఉన్నాయన్నారు. కళాశా లలో చేరే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు బుక్స్, బ్యాగులతో పాటు ఉచిత మధ్యాహ్న భోజనం కూడా అందిస్తామన్నారు. అలాగే జేఈఈ- మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్, ఎంసెట్ వంటి పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

కర్నూలు క్రైం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా పోలీసు అధికారులు మాట్లా డుతూ రౌడీ షీటరుల సత్ప్రవర్తనతో జీవించాలని, చట్టవ్యతిరేక కార్యక లాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.

ప్రత్యేక నిఘా ఉంచాం: సీఐ

సి.బెళగల్: రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు కోడుమూరు సీఐ తబ్రేజ్ అన్నారు. ఆదివారం మండలం లోని బురాన్‌దొడ్డి, మారందొడ్డి, బ్రాహ్మణదొడ్డి గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా సీఐ తబ్రేజ్ మాట్లాడుతూ రౌడీ షీటర్లు మంచి ప్రవర్తనతో జీవించాలన్నారు. గ్రామాల్లో రచ్చకట్ట పంచాయితీలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐ తిమ్మారెడ్డి, పోలీసులు ఉన్నారు.

ఆరోపణలు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమే: మేయర్

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): తనపై వచ్చిన ఆరోపణలు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమే అని నగర మేయర్ బీవై. రామయ్య టీడీపీ నేతలకు సవాల్ విసిరారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్పు తీసుకుంటే అవినీతి అంటారా? అని ప్రశ్నించారు. టీడీపీ అడ్డదారుల్లో ప్రలోభాలు పెట్టి ప్రజలతో ఓట్లు వేయించుకుని గెలిచారని అన్నారు. సమావేశంలో గ్రంథాలయ మాజీ చైర్మన్ సుభాష్‌చంద్రబోసు, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని విద్యాశాఖ అధికారిని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్. గోకారి డిమాండ్ చేశారు. ఆదివారం డీఈవో శామ్యూల్ పాల్‌ను కలిసి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్. గోకారి, కార్యదర్శి టీకే జనార్దన్ వినతి పత్రం అందజేశారు. ఇందులో ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుంకన్న, భాస్కర్, విక్టర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవాలి: ఒకే పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించినప్పటికీ సాంకేతిక సమస్యలతో జాయినింగ్ తేదీలు వేర్వేరుగా ఉన్నందున గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల పదోన్నతులకు పీఎస్ హెచ్ఎంల అన్ని క్యాడర్ల స్కూల్ అసిస్టెంట్లకు 2002 అక్టోబరు 1వ తేదీని పరిగణ నలోకి తీసుకుని కామన్ సీనియారిటీని లెక్కించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని పీఆర్‌టీయూ జిల్లా శాఖ కోరింది. ఆదివారం డీఈవో శామ్యూల్‌పాల్‌కు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ కృష్ణారెడ్డి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 2002 అక్టోబరు 1న, 2002 పాఠశాలల సహాయకులు, నవంబరు 1న పాఠశాలల విధుల్లో చేరడం వల్ల గ్రేడ్2 ప్రధానోపాధ్యాయుల సీనియారిటీలో పాఠశాలల సహాయకులకే నష్టం జరుగుతుందన్నారు.

'శ్రీగురూజీ పుస్తకం ఆదర్శ వ్యక్తిత్వాన్ని అందించే గ్రంథం'

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): గురూజీ గోల్వాల్కర్ రాసిన 'శ్రీగురూజీ - దృష్టి, దార్శనికత' పుస్తకం ఆదర్శ వ్యక్తిత్వాన్ని అందించే గొప్ప గ్రంథమని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం సాయంత్రం నగరంలోని కేసీ కెనాల్ సమీపంలోని వినాయక మందిరం సమావేశ హాలులో, జాతీయ సాహిత్య పరిషత్ కర్నూలు శాఖ ఆధ్వర్యంలో పుస్తక సమీక్ష సమావేశం నిర్వహించారు. తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థ రాష్ట్ర కార్యదర్శి జేఎస్ఆర్‌కే శర్మ మాట్లాడుతూ మాధవ గీత ఆధారంగా తెలుగులో అనువాదించిన శ్రీగురూజీ పుస్తకం అందరికీ ఉపయుక్తంగా నిలుస్తుందని చెప్పారు. పుస్తక సమీక్ష చేసిన నంద్యాలకు చెందిన డాక్టర్ ఖాదర్‌బాద్ ఉదయశంకర్, పుస్తక అనువాదకుడు వేదుల నరసింహులు మాట్లాడుతూ గురూజీ మహోన్నత వ్యక్తిత్వం తెలియాలంటే ఈ పుస్తకాన్ని చదవాలని సూచించారు.



మంత్రి టీజీ భరత్ దంపతులను ఆశీర్వదిస్తున్న వేద పండితుడు



వీకర్‌సెక్షన్ కాలనీలో శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గౌరు చరిత



కర్నూలు నగరంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయంలో పూజలకు హాజరైన టీజీ వెంకటేశ్ దంపతులు

వైభవంగా శ్రీరామనవమి

● సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని పాతబస్తీలోని రాంబొట్ల ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, వార్డు టీడీపీ నాయకుడు శేషయ్య యాదవ్, ఈవో దినేష్ పాల్గొ న్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, వడపప్పు, పానకం అందజేశారు. నగరంలోని అశోక్‌నగర్‌లోని ప్రసన్న ఆంజనేయస్వామి, ద్వారకామాయి సాయిబాబా దేవస్థానంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. శాస్త్ర పండితుడు ఇరివింటి కృష్ణమూర్తి కల్యాణ వేడుకలను ఆలయ అర్చకులు పుల్లయ్య చేత నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఎం.లక్ష్మణ్‌గౌడ్, కె.రామిరెడ్డి, ఎస్. జయరాంప్రసాద్‌లు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రం, కొత్తపేటలోగల కోదండ రామస్వామి, బళ్లారి చౌరస్తాలోని హనుమాన్ ఆలయాల్లో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. జడ్పీ ఆవరణలోని ఓంకారేశ్వరీ సహిత ఆంజనేయస్వామి, బళ్లారి చౌరస్తా సమీపంలోని నాగేంద్రనగర్‌లో వెలసిన సీతారామాంజనేయ ఆలయాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. పెద్ద పడఖానాలో ఏర్పాటు చేసిన శ్రీ సీతారాముల కల్యాణ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, ఎస్వీ విజయలక్ష్మి దంపతులు హాజరై పూజలు చేశారు. అదేవిధంగా నగరంలోని పలు ఆలయాల్లో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్, చల్లా నాగరాజశర్మ పాల్గొన్నారు.

సీతారామాలయంలో మంత్రి టీజీ దంపతులు: నగరంలోని సంకల్‌బాగ్‌లోని సీతారామాలయంలో ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్, శిల్పా దంపతులు పూజలు ప్రారంభించారు. భక్తుల కోసం నిర్మించిన ఈ ఆలయంలో రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, టీజీ రాజ్యలక్ష్మి దంపతులు కూడా పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్, టీజీ శిల్పా భరత్‌లను ఆలయ పండితులు రాజేశ్‌శర్మ వేదాశీర్వాదాన్ని అందజేశారు. ఆలయంలో ప్రతిష్ఠిం చనున్న విగ్రహాలను టీజీ వెంకటేశ్ దంపతులు స్వయంగా తీసుకొని ఆలయంలోని ప్రవేశించి అర్చకునికి అందజేశారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ నుంచి 12 వరకు జరిగే విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

● నెహ్రూనగర్‌లోని భగవాన్ సత్యసాయి మందిరంలో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి సత్య సాయి చిత్ర పటంతోపాటు సీతారామల లక్ష్మణ మూర్తుల ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి జిల్లా కన్వీనర్ మాకా అశోక్‌కుమార్, సాయిభక్తులు సూర్యనారాయణరెడ్డి, సాయి క్రిష్ణారెడ్డి, పట్టాభిరామయ్య, సాయిబాబా, రామ్మోహన్ పాల్గొన్నారు.

● నగరంలోని దామోదరం సంజీవయ్య స్మారక నగరపాలక మున్సిపల్ హైస్కూల్ క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన శ్రీరామనవమి వేడుకలకు ముఖ్య అతిథులుగా పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ ఏటా సీతారాముల కల్యాణోత్సవ సమితి కల్యాణం నిర్వహించడం అభినందనీయమన్నారు. సమితి ప్రతినిధులు మంత్రి టీజీ భరత్‌ను, ఎంపీ బస్తిపాటి నాగరాజులను ఘనంగా సత్కరించారు. వీసపాటి మధుసూదనాచార్యుల బృందం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. భక్తులకు విద్యాసంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి అన్నప్రసాదం పంపిణీ చేశారు. రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య, శ్రీసీతారాముల కల్యాణోత్సవ సమితి అధ్యక్ష కార్యదర్శులు కె. క్రిష్టన్న పాల్గొన్నారు.

కల్లూరు: కల్లూరు అర్బన్, రూరల్ మండలాల్లో శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఆదివారం 33, 28, 37వ వార్డు కల్లూరు, పందిపాడు, వీకర్‌సెక్షన్ కాలనీలో చేపట్టిన శ్రీరామనవమి వేడుకల్లో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత హాజరై పూజలు చేశారు. సీతారాముల కల్యాణంలో భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.. అనంతరం ఆలయ ధర్మకర్తల మండలి సమక్షంలో అన్నదాన ప్రసాద వితరణ చేపట్టారు. కొగనపాడు, ఉలిందకొండ, చిన్నటేకూరు, వామసముద్రం, బస్తిపాడు, ఎర్రకత్వ, పుసులూరు, గోవర్ధనగిరి గ్రామాల్లోని ఆలయాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా టీడీపీ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, 37,41 టీడీపీ వార్డు ఇన్‌చార్జిలు కృష్ణ వేణి, నాగేశ్వరరావు, జనార్దన్ ఆచారి, రాఘవేంద్రాచారి, అయ్యపురెడ్డి, ఎన్‌వీ రామకృష్ణ పాల్గొన్నారు.

● ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ ఎన్.హరినాథ్‌రెడ్డి తన స్వగ్రామం కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామంలోని చెలి మెకోన రామాలయంలో శ్రీరామనవమి వేడుకల్లో ఆయన పాల్గొని పూజలు చేశారు. ఆదివారం ఆయన సతీమణి ఎన్.అని తతో కలిసి సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి ధర్మపత్ని వేణుకళావతితో కలిసి శ్రీరామనవమి వేడుకల్లో పూజలు నిర్వహించారు. జడ్జి దంపతులు స్వామి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని ఓర్వకల్లు, కన్నమ డకల, పూడిచెర్ల, నన్నూరు, లొద్దిపల్లె, మీదివేముల, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, హుశేనాపురం, ఎన్.కొంతలపాడు, కాల్వబుగ్గ, కొమ్ముచెరువు, కాల్వ, శకునాల, సోమయాజులపల్లె తదితర గ్రామాల్లో ఆదివారం శ్రీరామ నవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. సీతారాముల ఉత్సవ విగ్రహాలకు వేదపండితులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఓర్వకల్లు చెన్నకేశవస్వామి ఆలయంలో ఈవో చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి కుటుంబ సభ్యులు సీతారాములకు పట్టువస్త్రాలు సమర్పించారు. పురోహితుల చేత సీతారాముల కల్యాణం నిర్వహించారు. హుశేనాపురం గ్రామంలో సీతారాముల కల్యాణాన్ని అర్చకులు రామ్మోహన్ శర్మ ఆధ ర్యంలో జరిగింది. స్వామి, అమ్మవార్ల విగ్రహాలను పల్లకిలో ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు గోవిందరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, కురువ పెద్దయ్య, జీకే సుధాకర్, కేవీ మధు, గొల్ల నాగరాజు, కాకి దేవేంద్ర, రామమద్దిలేటి, ఆకుల మహేష్, పుల్లారెడ్డి, పల్లెం తిరుపాలు పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ/ అర్బన్: పాతబస్తీలోని చెన్నకేశవ ఆలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆదివారం వలసింగం రెడ్డి శ్రీనివాసులు, పాండు లక్ష్మీనారాయణ, రాముడు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు సహకారంతో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

కోడుమూరు: శ్రీరామ నవమిని పురస్కరించుకొని స్థానిక రాముల వారి ఆలయంలో ఆదివారం సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఎస్ఎస్‌కే ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు పట్టణంలోని మహిళలు పాల్గొని సీతారాముల కల్యాణాన్ని కనులార వీక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జూతూరి రవి, శ్రీనివాసులు, నాగరాజు, బాబు, గోపి, వీరన్న పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: మండలంలోని అమడగుంట్ల, ప్యాలకుర్తి, కృష్ణాపురం, కొత్తపల్లి, వర్కూరు గ్రామాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం సీతారాముల ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఇందులో భాగంగా రథోత్సవం చేపట్టారు. కొత్తపల్లిలో పల్లకీసేవ, కృష్ణాపురంలో ఎద్దులబండిపై గ్రామోత్సవం చేపట్టారు. అమడగుంట్లలో ప్రభోత్సవం నిర్వహించారు.

సి.బెళగల్: మండలంలోని మారందొడ్డి, పల్దొడ్డి, కొండాపురం, గుండ్రేవుల, కొత్తకోట, బురాన్‌దొడ్డి, సిబెళగల్ గ్రామాల్లోని ఆలయాల్లో శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మణదాసు, బెల్లం శ్రీనివాసులు, తులసిరెడ్డి పాల్గొన్నారు.

గూడూరు: గూడూరు పట్టణంలోని వాల్మీకి ఆలయంలో ఆ సంఘం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితుడు ఆమంచి విశ్వేశ్వర శర్మ సీతారాముల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం అధ్యక్షుడు పుట్టపాశం రామాంజనేయులు, వాల్మీకి సంఘం పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

● గూడూరు నగర పంచాయతీ పరిధిలోని సీతారాములవారి ఆలయంలో సీతారాముల కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. కల్యాణోత్సవంలో మాజీ జడ్పీటీసీ ఎల్ వెంకటేశ్వర్లు దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



కొత్తపేటలోని కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణ వేడుకలు నిర్వహిస్తున్న భక్తులు



బళ్లారి రోడ్ పై జంక్షన్ దగ్గర నాగేంద్రనగర్‌లోని రామాలయంలో ఉత్సవమూర్తులను వేదిక వద్దకు తీసుకువస్తున్న భక్తులు



కోడుమూరులో..



ఓర్వకల్లులో సీతారాముల కల్యాణం వేడుకల్లో పాల్గొన్న టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి కుటుంబ సభ్యులు



ఓల్డ్‌సిటీ చెన్నకేశవస్వామి ఆలయంలో..



గూడూరులో..



సి.బెళగల్‌లో..

వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం పార్లమెంటులో ఆమోదించిన వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని వివిధ రాజకీయ, ప్రజా, కుల, విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. ఆదివారం కర్నూలు మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ ఆధ్వర్యంలో రాయల్ ఫంక్షన్ హాలులో సేవ్ ఇండియా-సేవ్ ఫండమెంటల్ రైట్స్ అనే బ్యానర్ కింద రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ కొత్త చట్టం ద్వారా వక్ఫ్ భూములపై సర్వే హక్కులు కలెక్టర్లకు ఇవ్వడం వల్ల భూమి వివాదాలు పెరిగే అవకాశం ఉందన్నారు. సీనియర్ న్యాయవాదులు జయ రాజు, ఖాలీద్, సీనియర్ మైనార్టీ నాయకుడు మోయిజ్‌ఖాన్, ట్రైబల్ యూనియన్ నాయకుడు కైలాస్ నాయక్, మాలమహానాడు జేఏసీ కన్వీనర్ యాట ఓబులేసు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అనంత రత్నం మాదిగ, జిలానీలు హాజరై వక్ఫ్ సవరణ బిల్లుపై తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. కార్యక్రమంలో వైసీపీ కార్పొరేటర్లు ఎస్‌టీ. షేక్ అహ్మద్, జుబేర్ అహ్మద్, యూనుస్ బాషా, అర్షియా పర్వీన్, షాషా వలి, విద్యార్థి సంఘాల నాయకులు వీపీ నాయుడు, రవి పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా సైక్లింగ్ చేయాలి

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు సైక్లింగ్ చేస్తే ఫిట్‌నెస్‌తోపాటు ఆరోగ్యం లభిస్తుందని ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ అన్నారు. ఆదివారం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయి) జిల్లా పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కొండారెడ్డి బురుజు నుంచి సైక్లింగ్ ర్యాలీని శాయి సెంటర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్‌తో కలిసి సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మన్సూరుద్దీన్ మాట్లాడారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, ట్రాఫిక్ ఎస్ఐ హుశేన్, సైక్లింగ్ కోఆర్డినేటర్ తైక్వాండో శిక్షకు డు కార్తికేయన్, హ్యాండ్‌బాల్ శిక్షకుడు జతిన్ సింగ్, పోలీసులు, శాయ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఓర్వకల్లు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎస్ఐ సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో గుడ్ ఫ్రైడే, ఈస్టర్ సందర్భంగా ఆదివారం ఓపెన్ టోర్నమెంటు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్ఐ సునీల్ కుమార్ పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు ఎంఎస్ రాజు, వెంకటస్వామి, పగిడాల కర్ణ, కిరణ్, మహేష్, చిన్న పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ వ్యవస్థాపక దినోత్సవం

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కల్లూరు బీజేపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ జెండాను ఆవిష్కరించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో బీజేపీ పార్టీ బలోపేతం ఎలా చేయాలనే విషయంపై కార్యకర్తలకు విధి విధానాలను తెలియజేశారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారన్నారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజు యాదవ్, రాష్ట్ర కోర్ కమిటి సభ్యులు చంద్రమౌలి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి యాదవ్, అధికార ప్రతినిధి డా.కొట్టె చెన్నయ్య, పార్టీ మండల అధ్యక్షుడు రామాంజ నేయులు రామ్మోహన్ రెడ్డి, గిరీష్ శర్మ, రవితేజ, పృథ్వీ, చిరంజీవి, శేఖరా చారి, వెంకటేశ్ పాల్గొన్నారు.

● కర్నూలు బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ పాల్గొని జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాయిప్రదీప్, సూర్యప్రకాష్, యోగానంద చౌదరి, గీతామాధురి, మాలతి, పాల్గొన్నారు.



జెండావిష్కరణలో పాల్గొన్న బీజేపీ నాయకులు

సీబీ రాఘవరెడ్డి విగ్రహావిష్కరణ

సి.బెళగల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు సీబీ రాఘవరెడ్డి విగ్రహాన్ని ఆయన సతీమణి, మాజీ సర్పంచ్ సబీ వసుంధరమ్మ ఆదివారం సి. బెళగల్ కొత్తబస్టాండులో అవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు టీడీపీని ఏర్పాటు చేసినప్పుడు సీబీ రాఘవరెడ్డి పార్టీలో చేరారని అన్నారు. అప్పటి నుంచి పార్టీ అభివృద్ధికి ఆయన ఎనలేని కృషి చేశారని అన్నారు. సీబీ విజయమ్మ, సీబీ ఆదిత్యారెడ్డి, సీబీ మౌనికరెడ్డి, ఎంపీటీసీలు ఈరన్నగౌడు, సర్పంచ్ పాండురంగన్న పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని కోల్స్ సెంటీని యల్ తెలుగు బాప్టిస్టు చర్చిలో ఆదివారం జరిగిన ఆరాధనలో రానున్న గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ కార్యక్రమాల పుస్తకాన్ని చర్చి పాస్టర్లు రెవ. అనిల్ శామ్యూల్, రెవ. జీవన్‌రావు, చర్చి అధ్యక్షుడు ఎడీఏ అబ్రహాం లింకన్, పర్వదినాల కార్యక్రమ నిర్వాహకులు కాకర్ల శాంసన్ పాల్, రెడ్డిపోగు ప్రవీ ణ్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ రెవ. అనిల్ శామ్యూల్ మాట్లాడుతూ క్రైస్తవులు ఈస్టర్ వరకు నిర్వహించే అనేక కార్యక్రమాల వివరాలు ముద్రించి సంఘస్తులకు అనుకూలంగా ఉండేలా ఈ పుస్తకాలు పంపిణీ చేస్తామని తెలిపారు. చర్చి కార్యదర్శి జాన్ విల్సన్, కోశాధికారి లక్ష్మన్న, స్టాండింగ్ కమిటీ సభ్యులు, సంఘస్తులు పాల్గొన్నారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు

గూడూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణంలో ఆదివారం శ్రీరామనవ మిని పురస్కరించుకుని నిర్వహించిన ఎద్దుల బండలాగుడు పోటీలు అట్టహాసంగా జరిగాయి. ఈ పోటీల్లో మొదటి విజేతగా రహమతుల్లా ఎద్దులు గెలుపొందగా.. దాత కర్నూలు పార్లమెంటు తెలుగు యువ త కార్యదర్శి చరణ్ కుమార్ రూ.4వేలు అందజేశారు. రెండో విజేతగా ఉత్తకాళ్ల రాముడు ఎద్దులు గెలుపొందగా.. దాత సంఘాల మధు రూ.3 వేలు అందజేశారు. మూడో విజేతగా మొర్రమ్మ వెంకటరమణ ఎద్దులు గెలుపొందగా.. దాత టీడీపీ సీనియర్ నాయకుడు చెట్టుకింది నారాయణ రూ.2వేలు అందజేశారు. టీడీపీ నాయకులు, కోట్ల టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన విద్యార్థుల విజ్ఞాన విహార యాత్ర

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్ష పర్యటనలో భాగంగా విద్యార్థుల విజ్ఞాన విహార యాత్ర ముగిసినట్లు ఎస్ఎస్ఏ ఏపీసీ టి.శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. జిల్లాలో ప్రాథమిక స్థాయిలో 150 మంది సెకండరీ స్థాయిలో 147 మంది విద్యార్థులు విజ్ఞాన శాస్త్రంలో ప్రతిభ గల వారిని ఎంపిక చేశామన్నారు. కుప్పంలోనే అగస్టియా ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లోని 32 సైన్స్ ప్రయోగశా లను విద్యార్థులు సందర్శించారన్నారు. సెకండరీ లెవల్‌లో రెండోరోజు బెంగళూరులోని విశ్వేశ్వరయ్య ఇండస్ట్రీయల్ సైన్స్ మ్యూజియాన్ని సందర్శించారు.

కల్యాణం.. కమనీయం

● ఆదోని, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో వైభవంగా శ్రీరామనవమి ● కల్యాణం చేసిన వేద పండితులు



ఆదోని చిన్మయ మిషన్‌లో సీతారాముల కల్యాణం


కంబాలపాడు వేడుకల్లో కేఈ కృష్ణమూర్తి దంపతులు


పత్తికొండలో ఎమ్మెల్యే శ్యాంబాబు పూజలు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. విక్టోరియా పేట కోదండ రామ స్వామి ఆలయంలో ధర్మకర్త రఘు ప్రేమ తీర్థ ఆధ్వర్యంలో చిన్మయ మిషన్ ఆవరణలో నిర్వహించారు. ముందుగా ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజలు చేపట్టారు. మహబూబ్ నగర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం దీక్షితుడు పాడిన భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. బ్రహ్మచారి నారాయణ చైతన్య, అధ్యక్షులు ఏగ్గాటి ప్రతాప్, మోహన్ రెడ్డి, విట్టా రమేష్, రఘునాథ్, రమేష్, రాముడు, జగదీష్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం నక్షత్ర ఆకార రామాలయంలో రాత్రి 8గంటలకు కల్యాణం చేశారు. ఎమ్మెల్యే పార్థసారథి, భక్తులు పాల్గొన్నారు. అలాగే పెద్దహరివాణం, సంతేకుడ్లూరు, మండిగిరి, బసాపురం గ్రామాల్లో వేడుకలు జరిగాయి. రూరల్ సీఐ నల్లన్న బందోబస్తు నిర్వహించారు.

కల్యాణంలో పాల్గొన్న కేఈ కృష్ణమూర్తి దంపతులు

క్రిష్ణగిరి: కంబాలపాడు గ్రామంలో మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, కేఈ పద్మావతి దంపతులు, మాజీ సర్పంచ్ కేఈ చెన్నయ్య దంపతులు పాల్గొన్నారు.

ఆలూరు: మండలంలో శ్రీరామ నవమి వేడుకలు జరుపుకున్నారు. స్థానిక రామాలయంలో సీతా రాముల కల్యాణం నిర్వహించారు.

హాలహర్వి: మండలంలో గ్రామాల్లో శ్రీరామ నవమినిర్వహించారు. సీతారాముల కళ్యాణం చూడటానికి జనం తరలివచ్చారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణం చేశారు.

ఆస్పరి: యాటకల్లు గ్రామంలో రథోత్సవం వేడుకలను జరుపుకున్నారు. కలపరి గ్రామంలో పల్లకి మహోత్సవం నిర్వహించారు.

మద్దికెర: మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు, కల్యాణోత్సవం వైభవంగా జరిగాయి. సాయంత్రం ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి ఊరేగించారు.

వెల్దుర్తి: మండలంలో శ్రీరామనవమి వైభవంగా నిర్వహించారు. వెల్దుర్తిలో ఇండేన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ ఎల్ఈ రమేశ్‌గౌడ్, ఎల్ఈ మహేశ్వరి దంపతులు పురోహితులు కేశవస్వామి, రాఘవేంద్ర ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. మాజీ ఎంపీపీలు దశరథరామిరెడ్డి, జ్ఞానేశ్వర్‌గౌడు, పారిశ్రామికవేత్త సాయిప్రసాద్ హాజరయ్యారు. క్రిష్ణాపురం, రామళ్లకోట, సిద్దనగట్టు, బోయినపల్లి, రత్నపల్లి, నరసాపురం, మాదార్‌పురం గ్రామాల్లో గ్రామపెద్దలు నిర్వహించారు.

పత్తికొండ: పట్టణంలోని పాతపేట రామాలయం, అంజనేయ నగర్ సీతారామ దేవాలయం, కొత్తపేట రామాలయాల్లో సీతారాముల కల్యాణం నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. పాతపేట రామాలయం, ఆంజనేయనగర్ సీతరామ ఆలయాల్లో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పాల్గొన్నారు. సాంబశివారెడ్డి, రామానాయుడు ఉన్నారు.

దేవనకొండ: మండలలంలోని తలమర్రి, కరివేముల, దేవనకొండ, పి.కోటకొండ, నల్లచెలిమల, గ్రామాల్లో కల్యాణం చేశారు.

ఆదోని టౌన్: పట్టణంలోని వైఎంకే నగర్‌లో సాయిబాబా ఆలయంలో శ్రీరామ నవమి నిర్వహించారు. వీరస్వామి, డీవీవీ ప్రసాద్, టీజీ రామ్ ప్రసాద్ సాయి సమితి ఆధ్వర్యంలో జరిగాయి.

చిప్పగిరి: దౌల్తాపురం, చిప్పగిరి, నేమకల్లు, కుందన్ గుర్తి, కట్టాల, ఏరూరు, డేగలహాలు గ్రామాల్లో కల్యాణోత్సవాలు జరిగాయి.

ఆలూరు రూరల్: మండలంలోని కమ్మరచేడు ముద్దనగేరి, మొలగవల్లి, హత్తిబెళగల్, బెళ్ళిగుండు అంజనేయ స్వామి ఆలయాల్లో వేడుకలు జరిగాయి. ఎమ్మెల్యే విరుపాక్షి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ హరి, పుష్పవతి, మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

తుగ్గలిలో ఘనంగా కల్యాణోత్సవం

తుగ్గలి: మండలంలోని తుగ్గలి, పగిడిరాయి, జొన్నగిరి, చెన్నంపల్లి, రామలింగాయపల్లె తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణం నిర్వహించారు. తుగ్గలిలో విశ్రాంత వీఆర్వో దామోదర్ రెడ్డి ఇంటి నుంచి మహిళలు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర ఇంటి నుంచి తలంబ్రాల బొట్లు, తాలిబొట్లు తీసుకునివచ్చి కల్యాణం నిర్వహించారు. సాయంత్రం పరమేశ్వరెడ్డి ఇంటి నుంచి కుంభం తీసుకువచ్చి విశేష పూజలు చేశారు. భక్తులకు తుగ్గలి నాగేంద్ర అన్నదానం నిర్వహించారు.


తుగ్గలిలో కలశాలతో భక్తుల ఊరేగింపు


చిప్పగిరి మండలం దౌల్తాపురంలో రథోత్సవం


తుగ్గలిలో రథోత్సవం


ఆలూరు మండలం కమ్మరచేడులో ఎమ్మెల్యే విరుపాక్షి పూజలు

పేదల కోసం కష్టాన్ని భరిస్తా

● టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పేదల అభివృద్ధి కోసం కష్టాన్ని భరించి అండగా ఉంటానని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర అన్నారు. ఆదివారం తుగ్గలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఫ్యాక్షన్ నేపథ్యంలో భయభ్రాంతులకు గురవుతున్న తరుణంలో అల్లర్లు జరగకుండా ఉండాలని రామాలయంలో పూజలు నిర్వహించామన్నారు. 27 ఏళ్ల పాటు సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నామన్నారు. ఈనాటి నా జీవితం సీఎం చంద్రబాబు పెట్టిన భిక్షే అని, ఆయన మేలు ఎప్పటికీ మరువలేమన్నారు. భవిష్యత్తులో వందల సంఖ్యలో ఉచిత సామూహిక వివాహాలు చేస్తానని తెలిపారు. జంటలకు తాలిబొట్లు, నూతన వస్త్రాలు కొన్నేళ్ల నుంచి ఉచితంగా ఇస్తున్నానని, కష్టం వచ్చిన పేదవారికి అండగా ఉంటున్నామన్నారు. మాజీ జడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి, వంశీ, తదితరులు ఉన్నారు.

వృద్ధాశ్రమాలకు నిత్యావసరాల పంపిణీ

పత్తికొండ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శారద, నాగరత్నమ్మ వృద్ధాశ్రమాలకు హైదరాబాద్‌కు చెందిన పారిశ్రామిక వేత్త చల్లా కుమార్ సతీమణి చల్లా జాహ్నవి ఆదివారం నిత్యావసరాలు అందించారు. మూడు క్వింటాళ్ల బియ్యం, 50 కిలోల కంది పప్పు రెండు వృద్ధాశ్రమాలకు ఆమె అందజేశారు. సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు చల్లా రవీంద్రనాథ్ చౌదరి ఉన్నారు.

విద్యుత్ సమస్య తీరుతుంది


స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మద్దికెర, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సబ్ స్టేషన్ నిర్మాణంతో మండలంలోని పెరవలి, బసినేపల్లి, మదనంతపురం, హంపా, బొమ్మనపల్లి, తుగ్గలి మండలంలోని కొత్నీ గ్రామాలకు విద్యుత్ సమస్య తీరుతుందని ఏఈ మహ్మద్ రఫిక్ అన్నారు. ఆదివారం పెరవలి గ్రామ శివారులో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. వేసవిఇ దృష్టిలో ఉంచుకుని విద్యుత్ అంతరాయం కలగకుండా మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పార్టీ నాయకురాలు రామాంజనమ్మ జెండాను ఆవిష్కరించారు. అసెంబ్లీ కన్వీనర్ గోవర్దన్ నాయుడు, ఎ కరణం నరేష్, సీసీ రంగన్న మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తుందన్నారు. మల్లికార్జున, నగేష్, హస్త రామ్మోహన్, ఓబీసీ రామాంజనేయులు, బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా అతిథి గృహం పనులు


పనులను పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ డీఈఈ వెంకటేశ్వర్లు

ఆలూరు రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నూతన అతిథి గృహం పనులు ముమ్మరంగా సాగుతున్నాయని ఆర్అండ్‌బీ డీఈఈ వెంకటేశ్వర్లు, ఏఈఈ సాయి సురేష్ అన్నారు. ఆదివారం నిర్మాణ పనులను డీఈఈ పరిశీలించారు. భవనంతో పాటు సీసీ రోడ్డు పనులు ప్రహరీని నిర్మిస్తామన్నారు. కర్నూలు రహదారిలో చిన్నహోతూరు నుంచి ఆలూరు వరకు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.3కోట్లు, హొళగుందలో డబుల్ సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు చేసిందన్నారు.

చెత్తను ఆరుబయట వేయరాదు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎల్‌పీవో వీరభద్రప్ప

మద్దికెర, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలు చెత్తాచెదారాన్ని ఆరుబయట వేయొద్దని డీఎల్‌పీవో వీరభద్రప్ప సూచించారు. ఆదివారం మద్దికెరలో ప్రజలకు అవగాహన కల్పించారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయాలని, ఆహార వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయడం వల్ల దోమల సంతతి పెరిగి ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటిని వృథా చేయకుండా వాడుకోవాలన్నారు. వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సుహాసిని, పంచాయతీ సలహాదారులు ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ ఉన్నారు. గిడ్డయ్య వీధిలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించారని సీఎంవో ఆఫీసుకు ఫిర్యాదు చేయడంతో డీఎల్‌పీవో ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడం చట్టరీత్యా నేరమన్నారు. ఆక్రమణదారులు నాలుగు రోజుల్లోపు ఖాళీ చేయాలని తెలిపారు. జడ్పీ బాలుర పాఠశాల అవతల ఆక్రమణలు తొలగించి, కాంప్లెక్స్ నిర్మిస్తామన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

ఆలూరు రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఆలూరును కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని మొలగవల్లి రైతులు కోనకొండ్ల సోమన్న, గోపాల్, చిలక మాణిక్యం, నాగరాజు అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడతూ ఎంతో ఆశతో పంటలు సాగు చేశామని, అతివృష్టి. వాతావరణ మార్పులతో నష్టం వాటిల్లిందని వాపోయారు. వాము శనగ, ఎర్రజొన్న పంటలు సాగు చేస్తే దిగుబడి రాలేదని చెప్పారు. పంట సాగు కోసం అప్పులు చేసి పెట్టుబడులు పెడితే పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వేదవతి ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని, ఆలూరు, మొలగవల్లి ప్రాంతాలకు సాగునీరు అందించాలని కోరారు. సమావేశంలో రైతులు చిన్నప్ప, మల్లికార్జున, ఓంకార్ పాల్గొన్నారు.

మోదీ పాలనకు తిరుగులేదు


మాట్లాడుతున్న లలితమ్మ

ఆదోని టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో మోదీ పాలనకు తిరుగు లేదని 35వ వార్డు కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ అన్నారు. ఆదివారం 35వ వార్డు అమరావతి నగర్‌లో బీజేపీ ఆవిర్భావం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. దేశాన్ని అభివృద్ధి పథకంలో నడిపిస్తూ, పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటున్న బీజేపీని అన్ని రాష్ట్రాల ప్రజలు కోరుకుంటున్నారన్నారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాస్, న్యాయవాది లోకేష్ కుమార్, సౌత్ జోన్ ప్రధాన కార్యదర్శి పగడాల కిరణ్, మహిళా అధ్యక్షులు రాణమ్మ, ఉపాధ్యక్షులు పూల రఘు, కార్యదర్శి అల్లాబకాష్, 18వ వార్డు కౌన్సిలర్ చిన్న, చిరంజీవి, పరుశురాం పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం పట్టణంలోని నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఆధ్వర్యంలో మంగళాంజనేయ స్వామి ఆలయం నుంచి ఏరియా ఆసుపత్రి వరకు శోభా యాత్ర నిర్వహించారు. భీమాస్ సర్కిల్లో ఎమ్మెల్యే మాట్లాడాడుతూ మాజీ ప్రధాని వాజ్‌పేయి నేతృత్వంలో 1980 ఏప్రిల్ 6న పార్టీని స్థాపించారన్నారు. ఆదోని నియోజకవర్గ అభివృద్ధి కోసం అసెంబ్లీలో ప్రజల వాణి వినిపించానన్నారు. నాయకులు కునిగిరి నీలకంఠ, ఉపేంద్ర, నాగరాజు గౌడ్, సాయి, మల్లిక అవ్వ, పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆదోని రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కపటి, విరుపాపురం, పెద్దహరివాణం, పెద్దతుంబళం, తదితర గ్రామాల్లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. నాయకులు ఉషారాజు, కపటి రాజు మాట్లాడుతూ, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పార్టీ ఆవిర్భవించిందన్నారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. పెండింగ్‌లో బకాయిలను చెల్లించాలని, 12వ పీఆర్సీ ని నియమించి 30శాతం ఐఆర్ ఇవ్వాలన్నారు. పురపాలక పాఠశాల ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించాలని కోరారు. విద్యా సంవత్సరం ఆరంభంలోపు ఖాలీలను భర్తీ చేయాలన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌కేడీ కాలనీ భార్గవ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల వార్షికోత్సవం కరస్పాండెంట్ పావని కుమారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈవో రాజేంద్రప్రసాద్ హాజరై మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగి ఉపాధ్యాయులను తల్లిదండ్రులను గౌరవించినప్పుడే చదువుల్లో రాణిస్తారన్నారు. ఉన్నత ఆశయం కలిగి చదువుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమం అలరించింది.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

మద్దికెర, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ జిల్లా కార్యదర్శి గూడూరు ధనుంజయుడు అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. ఎమ్మెల్యే శ్యాంబాబు గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారన్నారు. మద్దికెర నుంచి బురుజులకు రోడ్డు నిర్మాణానికి సర్వేపూర్తయిందన్నారు. మండలంలో రూ.2 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. కరువు మండలంగా ప్రకటించినందుకు ఎమ్మెల్యేకు, కూటమి ప్రభుత్వానికి రైతులు రుణపడి ఉంటారన్నారు. శాంతిరెడ్డి, రంగన్న తదితరులు ఉన్నారు.

బైకులు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

చిప్పగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామదుర్గం వద్ద ఆదివారంద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. చిప్పగిరికి చెందిన పాపన్న బైకులో ఆలూరు వైపు వెళ్తూ ఉండగా, రామదుర్గం గ్రామానికి చెందిన నాగరాజు మరో బైక్‌పై గుంతకల్ వైపు వెళుతుండగా రెండు వాహనాలు ఢీ కొట్టాయి. ఆపన్నకు కాలు విరగగా, నాగరాజు తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారమందించారు. సిబ్బంది చేరుకుని క్షతగ్రాతులను ఆసుపత్రికి తరలించారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న మిత్రులు

దేవనకొండ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వారం కిందట తెర్నేకల్ గ్రామానికి చెందిన ప్రవీణ్ విద్యుదాఘాతంతో మృతి చెందాడు. దీంతో జడ్పీపాఠశాల 2010 పదో తరగతి మిత్రులు ఆదివారం రూ.47 వేలు ఆర్థిక సాయం చేశారు. అందరితో చనువుగా ఉండే ప్రవీణ్ మృతి దురదృష్టకరమన్నారు. అలాగే గ్రామానికి చెందిన వైసీపీ జిల్లా నాయకుడు కొత్తకాపు మధుసుధన్‌రెడ్డి రూ.10వేలు, సురేంద్రరెడ్డి రూ.10వేలు, సర్పంచ్ అరుణ్‌కుమార్ రూ.10వేలు అందజేశారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): దేవనకొండ మండలం దళిత విలేకరి భీమలింగడుపై దాడి చేసిన కన్నప్పపై చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం సీఆర్ భవన్‌లో మాట్లాడుతూ ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తున్నారన్న విషయాన్ని తెలుసుకుని కవరేజీకీ వెళ్లగా ఎక్స్‌కవేటర్ యజమాని బోయ కన్నప్ప కులం పేరుతో దూషించి దాడి చేశాడనీ, తక్షణమే దాడి చేసిన కన్నప్పపై కేసు నమోదు చేసి విలేకరికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. రంగన్న, నాయకులు నాగేంద్ర, కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వంతో భరోసా

తుగ్గలి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కుటుంబానికి భరోసా ఉంటుందని ఆ పార్టీ నాయకుడు భీమలింగప్ప చౌదరి మల్లయ్య అన్నారు. ఆదివారం రాంపురంలో సభ్యత్వ కార్డులను అందించారు. సభత్వం ఉన్న వారికి రూ.5 లక్షల బీమా అందుతుందన్నారు. నాయకులు మద్దిలేటి చౌదరి, రఫీ తదితరులు ఉన్నారు.


రాంపురంలో సభ్యత్వ కార్డులు ఇస్తున్న నాయకులు

చెత్త లక్ష్యం

● చెత్త నుంచి సంపద కేంద్రాలను పట్టించుకోని అధికారులు
● నిర్వహణ లేక శిథిలం.. రైతులకు అందని వర్మికంపోస్టు


హాళేబీడు గ్రామంలో నిరుపయోగంగా చెత్త నుంచి సంపద కేంద్రం


మొలగవల్లి గ్రామంలో కేంద్రం దుస్థితి

ఆలూరు రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): చెత్త సంపద కేంద్రాలు లక్ష్యానికి దూరంగా ఉన్నాయి. వీటిని ఉపయోగంలోకి తీసుకురాకపోవడంతో అవి పనికిరాకుండా పోయే ప్రమాదం ఉంది. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం చెత్త నుంచి సంపద సృష్టించాలనే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేసింది. మొలగవల్లి, హాలేబీడు, ముద్దనగేరి, కురకుంద, మరకట్టు, కమ్మరచేడు, మునసహళ్ళీ, పెద్దహోతూరు తదితర గ్రామాల్లో నిరూపయోగంగా మారాయి. వర్మీకంపోస్టు తయారు చేసి విక్రయించిన దాఖలాలు లేవు.

పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం

ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద కేంద్రాలను గత వైసీపీ ప్రభుత్వం పట్టించులేదు. దీంతో అవి క్షేత్రస్థాయిలో నిరుపయోగంగా మారాయి.

అధికారుల పర్యవేక్షణ కరువు

మండలంలో 16 గ్రామ పంచాయితీలు ఉండగా 15 చెత్తనుంచి సంపద కేంద్రాలు నిర్మించారు. వీటిలో మూడు తప్ప మిగతావన్నీ నిరుపయోగంగా ఉన్నాయి. వీటి నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో లక్ష్యం నీరు గారింది. మొలగవల్లి గ్రామంలో 18వేల జనాభా ఉంది. ఇక్కడ నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రానికి దారి లేదని అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఈ కేంద్రం కూలిపోయింది.

ప్రభుత్వం ఆదేశించినా?

చెత్త నుంచి సంపద కేంద్రాలను తిరిగి ఉపయోగంలోకి తీసుకురావాలని టీడీపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయినా కూడా అధికారులు పట్టించుకోవడం లేదు

వర్మికంపోస్టు అందించాలి

చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల ద్వారా రైతులకు వర్మికంపోస్టు అందించాలి. వానపాములతో తయారు చేసే ఎరువుతో పంటలకు ఉపయోగం ఉంటుంది. **- ఈరన్న రైతు, ఆగ్రహారం**

చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలను ఉపయోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. తడ్డి, పొడి చెత్తను వేరు చేసి వర్మికంపోస్టు తయారు చేసి, రైతులకు విక్రయించి, పంచాయతీలకు ఆదాయం తెస్తాం. **- ప్రభాకర్, ఇన్‌చార్జి ఈవోఆర్డీ, ఆలూరు**

రాఘవేంద్రుడి సన్నిధిలో ఏపీ హైకోర్టు జడ్జి



శ్రీమఠంలో చెక్క రథాన్ని లాగుతున్న ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ హరినాథ్ శర్మ

మంత్రాలయం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ హరినాథ్ శర్మ కుటుంబ సమేతంగా ఆదివారం రాత్రి రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. మహా ముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు శ్రీపతి ఆచార్, వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహ మూర్తి ఘనంగా స్వాగతం పలికారు. న్యాయమూర్తి కుటుంబ సమేతంగా గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం ప్రహ్లాదరాయల చెక్కరథాన్ని లాగారు. మఠం పండితులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఆయన వెంట అనంతపురాణిక్, ఎస్ఐ శివాంజిల్, లక్ష్మీనారాయణ, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మూలరాములకు మహాభిషేకం



మూలరాములకు మహాభిషేకం చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): వేదపండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల హర్షధ్వనుల మధ్య మూల రాములకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మహాభిషేకం నిర్వహించారు. ఆదివారం కర్ణాటకలోని అరుగోందే నవబృందావనం సన్నిదానంలో శ్రీరామనవమి శుభ సందర్భాన్ని పురస్కరించుకొని రాతి మంటపంలో మూలరాములు, జయరాములు, దిగ్విజయ రాములకు మహాభిషేకం చేశారు. క్షీరాభిషేకం, తులసి అర్చన, పుష్పాభిషేకం, స్వర్ణ నాణేలతో అభిషేకం, వివిధ పదార్థాలతో మహ అభిషేకం పీఠాధిపతి స్వ హస్తాలచే చేస్తుండగా అశేష మంది భక్తులు కనులారా తిలకించి మంత్రముగ్ధుల య్యారు. అంతకు ముందు కవీంద్ర తీర్థుల మూల బృందావనానికి విశేష పూజలు చేసి శోభాయమానంగా అలంకరించారు. ప్రకాష్ ఆచార్, ద్వారపాలక అనంతస్వామి, వరదేంద్రాచార్, పవన్ఆచార్ పాల్గొన్నారు.

కన్నుల పండువగా కవీంద్ర తీర్థుల మధ్యారాధన

మంత్రాలయం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి పరమ గురువులైన పూర్వపు పీఠాధిపతి కవీంద్ర తీర్థుల మధ్యరాధన మహోత్సవాలు కన్నుల పండువగా జరుపుకున్నారు. కర్ణాటకలోని అనుగొంది నవబృందావనంలో వెలసిన కవీంద్ర తీర్థుల బృందావనానికి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం వేదపండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం నిర్వహించి బంగారు, వెండి ఆభరణాలతో పాటు, పట్టు వస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించిన దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్వామివారికి హస్తోదకం చేసి పీఠాధిపతి మహ మంగళహరతి ఇచ్చారు. అక్కడే సంస్థాన పూజ చేశారు. వందలాది మంది పాల్గొన్న భక్తులకు వేధపండితులు కవీంద్ర తీర్థుల ప్రవచన సందేశం చేశారు. పీఠాధిపతి శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్‌కు పదోన్నతి

కోసిగి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కోసిగి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కె.నాగరాజు ఎక్సైజ్ ఎస్ఐగా పదోన్నతి పొందారు. కోసిగి ఎక్సైజ్ స్టేషన్ నుంచి నంద్యాల జిల్లా బనగానపల్లె ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌కు ఎస్ఐగా ప్రమోషన్‌పై వెళ్తున్నట్లు కోసిగి సీఐ భార్గవ్ రెడ్డి తెలిపారు. ఎస్ఐగా ప్రమోషన్ పొందిన కే.నాగరాజుకు ఆదివారం శాలువ, పూలమాలతో సీఐ భార్గవ్ రెడ్డి తన సిబ్బందితో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగరాజుకు ఎక్సైజ్ ఎస్ఐ కార్తీక్ సాగర్ సిబ్బంది మునిరంగడు, భరత్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

గడ్డివామి దగ్ధం

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని దైవందిన్నె గ్రామంలో అగ్నిప్రమాదం జరిగిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రామాంజనేయులు అనే రైతుకు చెందిన గడ్డివాము ప్రమాద వశాత్తు నిప్పంటుకోవడంతో దాదాపు రూ.లక్ష ఆస్తినష్టం జరిగినట్లు రైతు తెలిపారు. నష్టపోయిన రైతును ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

శ్రీమఠంలో రథోత్సవం

మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు



భక్తులతో రద్దీగా ఉన్న శ్రీమఠం ప్రాంగణం

మంత్రాలయం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు రజత రథంపై విహరించారు. ఆదివారం రాత్రి శ్రీరామనవమి శభదినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బృందావనాన్ని బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం రజత రథాన్ని వివిధ పుష్పాలతో చూడ ముచ్చటగా అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల మధ్య ప్రహ్లాదరాయలను అధిష్ఠించి పీఠాధిపతి మహామంగళహారతులు ఇచ్చి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజల మంటపంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఊంజలసేవ నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరావడంతో మంత్రాలయం పురవీధులన్నీ కిక్కిరిసిపోయాయి.

వైభవంగా శ్రీరామనవమి

● సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు
● ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మంత్రాలయం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకొని మంత్రాలయం పాత ఆంజనేయ స్వామి దేవాలయంలో, మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. మంత్రాలయంలో పాత వీధి నుంచి రాఘవేంద్ర సర్కిల్ మీదుగా ఆలయ అర్చకులు రమణయ్య, భీమాచార్యులు, మధుసూదన్ఆచార్, సూర్యనారాయణా చార్, భాస్కర్ ఆచార్‌ల ఆధ్వర్యంలో పల్లకీ ఉత్సవం నిర్వహించారు. శ్రీరాముడు, సీత, లక్ష్మణ, లవకుశ, ఆంజనేయస్వామి వేషధారణలు ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నదానం నిర్వహించారు. మంత్రాలయం సర్పంచ్ భీమయ్య, మల్లికార్జున టీడీపీ నాయకులు అశోక్ రెడ్డి, వరదరాజులు, నరసింహులు, వెంకటేశ్, సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

నందవరం: మండలంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కల్యాణం, పల్లకీ ఉత్సవాలు నిర్వహించారు.

ఎమ్మిగనూరు/టౌన్: పట్టణంలోని వివిధ కాలనీల్లోని ఆలయాల్లో శ్రీరామ నవమిని వైభవంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఎద్దుల మార్కెట్ సమీపంలో వెలసిని సీతారామాంజనేయస్వామి ఆలయంలో జరిగిన వేడుకల్లో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి దంపతులు పాల్గొని స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అర్చకులు వరప్రసాద్, శ్రీధర్ స్వామి ఆలయ కమిటీ సభ్యులు కేఎస్పీ శివన్న, బిజ్జే నాగరాజు, బూత సత్యనారాయణ, గంగన్న, నాగరాజు, నారాయణ పాల్గొన్నారు.

● మిలిటరి కాలనీలోని సీతారామంజనేయ స్వామి దేవాలయం తరపున శ్రీరామ నవమి సందర్భంగా విశ్వహిందూ పరిషత్, హిందూ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో శ్రీరాముడి శోభాయాత్ర నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షుడు ఆర్.సత్యనారాయణ రెడ్డి,. దర్మారెడ్డి, కృష్ణ చైతన్య రెడ్డి, ఉరుకుందు, కాసుల రాము తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: కోసిగిలోని శ్రీరామ దేవాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. ధర్మకర్త ఇల్లూరి శ్రీరాములగుప్తా, శ్రీనివాస్ శెట్టి, పురోహితులు పల్లెపాడు పద్మనాభాచారి, మూర్తి స్వామి, ఆదోని కృష్ణస్వామి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి కోసిగి ఎస్ఐ హనుమంతరెడ్డి దంపతులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీరామనగర్‌లో జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవానికి వైసీపీ సీనియర్ నాయకులు వై.రుద్రగౌడు, పురుషోత్తంగౌడు హాజరయ్యారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

పెద్దకడుబూరు: మండలంలో శ్రీరామ నవమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కల్యాణం, గ్రామోత్సవాలు నిర్వహించారు.

గోనెగండ్ల: గోనెగండ్లతో పాటు వివిధ గ్రామాల్లో శ్రీరామ నవమిని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. గోనెగండ్లలోని ఆంజనేయస్వామి దేవాలయం శ్రీరామ దేవాలయం వీరశైవమఠం పీఠాధిపతి శివయ్య స్వామి ఆధ్వర్యంలో గోనెగండ్ల సీఐ విజయభాస్కర్ కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఆంజనేయస్వామి దేవాలయం నందు సుబ్రమాణేశ్వరావు ఆధ్వర్యంలో స్వామివారికి కల్యాణం నిర్వహించారు. శ్రీ చింతలాముని నల్లారెడ్డి దేవాలయంలో గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. కులుమాలలో మాజీ సర్పంచ్ శ్రీనివాసులు స్వామి వారికి కల్యాణం నిర్వహించారు.

కౌతాళం: మండలంలోని సీతారామాలయాలలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలను భక్తులు, ప్రజలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా రాజానగర్ క్యాంపు, కుంబళనూరు క్యాంపు, బుదుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, కౌతాళంలోని సీతారామ ఆలయంలో భక్తుల సందడి కనిపించింది. రాజనగర్ క్యాంపులో నిర్వహించిన కల్యాణోత్సవంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి వెంకటపతిరాజు దంపతులు పాల్గొన్నారు. ఉరుకుంద ఈరన్న స్వామి దేవాల యంలో ఆలయ ఈఓ విజయరాజు ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



గోనెగండ్ల మండలం పెద్దనేలటూరులో..



కౌతాళం మండలం రాజనగర్ క్యాంపులో..



ఎమ్మిగనూరులో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి దంపతులు



మంత్రాలయంలో సీతారాముల పల్లకీ ఉత్సవం



ముగతిలో కలశాలతో చిన్నారులు



ఎమ్మిగనూరులో సీతారాముల వారికి తలంబ్రాలు పోస్తున్న పూజారి





గంగులపాడు, కోసిగిలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చెత్త నుంచి సంపద సృష్టించాలి



చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గోనెగండ్ల, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపదను సృష్టించాలని ఆదోని డీఎల్‌పీవో నూర్జహాన్, ఈవోఆర్డీ అనంతశయన సిబ్బంది సూచించారు. గోనెగండ్ల పంచాయతీ సిబ్బంది గ్రామంలో ఇంటింటి వెళ్లి తడి చెత్తను పొడిచెత్తను ప్రతి రోజు సేకరిస్తున్నారా? లేదా? అని చెత్త సేకరణ సిబ్బందితో పాటు ఆదివారం ఇంటింటికి వెళ్లి అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లోని అన్ని గ్రామాలలో ఆయా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పంచాయతీ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలని సూచించారు. డీఎల్‌పీవో మాట్లాడుతూ ఇళ్ల దగ్గర ఉన్న చెత్తను తీసుకువచ్చి వర్మీ కంపోస్టు తయారు చేసి అమ్మకాలు జరిపి ఆయా పంచాయతీలకు ఆదాయం తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కింద ఈ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు పండ్లు పంపిణీ



పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కోసిగి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కోసిగి ప్రభుత్వ ఆసుపత్రిలో టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు పెండ్యాల భరద్వాజ శెట్టి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు బాలింతలు, గర్భిణులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. రేణుకా ఎల్లమ్మ ఆలయం ప్రాంగణంలో అనాథలకు అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు పరుషగేరి హనుమంతు, ఉప్పర రాజు, మారేష్, రాజశేఖర్‌రెడ్డి, రామయ్య, దేవన్న, మధు, హాశేనీ, నాగరాజు, సత్తిరెడ్డి తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

కోసిగి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని ఒకటో వార్డుకు చెందిన ఎస్‌కే-11 క్రికెట్ జట్టు క్రీడాకారులకు టీడీపీ నాయకుడే వక్రాణి వెంకటేశ్ క్రీడా దుస్తులు ఆదివారం పంపిణీ చేశారు. 15 మంది క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. నాయకులు కప్పయ్య, భీమయ్య, హనుమంతరెడ్డి, క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

కోసిగి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కోసిగిలో బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ మండల అధ్యక్షులు ఆరేకంటి రాముడు ఆధ్వర్యంలో నిర్వహించారు. బీజేపీ జెండా ఎగురవేశారు. రాముడు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. నాయకులు మారెన్న, తమ్మారెడ్డి, కడిదొడ్డి ఈరమ్మ, హాశేనీ, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడిన చేనేత కార్మికుడు బాలచంద్ర కుటుంబానికి టీడీపీ నాయకులు ఆర్థికసాయం అందజేశారు. ఆదివారం టీడీపీ నాయకులు మూడో వార్డు కౌన్సిలర్ స్వాతి భర్త వినయ్, టౌన్ బ్యాంకు వైస్ చైర్మన్ నరసప్ప బాలచంద్ర మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆదేశాలతో మృతుని బంధువులకు ఆర్థిక సాయం అందించి పరామర్శించారు. నాయకులు మాట్లాడుతూ బాలచంద్ర కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిదాల ఆదుకునేందుకు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. టీడీపీ నాయకులు కే కృష్ణ, శ్రీనివాసులు, బాషా, బుగిడె నాగరాజు, కనికే నాగరాజు, పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే బీవీ జన్మదిన వేడుకలు

కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యాలయంలో, సోమప్ప నగర్, ఎన్టీఆర్ కాలనీతో పాటు ఆయా వార్డుల్లోనూ, మండలపరిదిలోని ఆయా గ్రామాల్లో టీడీపీ శ్రేణులు కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచి ఎమ్మెల్యే బీవీ జన్మదినాన్ని ఘనంగా జరుపుకొన్నారు. అలాగే పట్టణంలో బైక్ రాలీ నిర్వహించి సోమప్ప సర్కిల్‌లో వ్యాపార వేత్త, టీడీపీ నాయకుడు బాస్కర్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. అలాగే పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని కుర్ని కమ్యూనిటీ హాల్‌లో టీడీపీ చేనేత నాయకుడు బుగిడె నాగరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బీవీ జన్మదని వేడుకలు నిర్వహిఅంచారు. కార్యక్రమాల్లో నాయకులు నరసింహులు, రామదాసు గౌడ్, మాచాని శివకుమార్, నవాజ్, మద్దిలేటి, ఇసాక్, అమాన్, జయన్న, మాచాపురం కాశీంవలి, ధర్మపురం గోపాల్, కేటీ వెంకటేశులు, డబ్బా ఈరన్న, గుల్లా సలాం, సూరి, అబ్దుల్లా, పెద్దరంగన్న, ఈరన్న, సోగనూరు జగదీశ్, శంకర్ గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: గోనెగండ్లలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు కార్యకర్తలు ఘనంగా జరుపుకొన్నారు. అభిమానులు కేట్ కట్ చేశారు. మిఠాయిలు పంచారు. మాజీ ఎంపీపీ హనుమంతు, బేతాళబడేసా, పెద్దమరివీడు మల్లయ్య, నజీర్, రామాంజనేయులు, తిరుపతయ్యనాయుడు, తిమ్మారెడ్డి, శ్రీధర్, రమేష్‌నాయుడు, చంద్రశేఖర్, రంగముని, కాంట్రాక్టర్ షేక్షావలి, నూరహమ్మద్, చిన్ననేలటూరు నాగన్న, ఫక్రుద్దీన్, భారతరం రహంతుల్లా, కార్యకర్తలు, ఎన్టీఆర్, ఎన్‌బీకే అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.





ఎమ్మిగనూరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ చేనేత నాయకుడు బుగిడె నాగరాజు, తదితరులు, మూడో వార్డులో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఇళ్ల మధ్యనే మురుగు

● కంపు కొడుతున్న కాలనీలు
● దోమలు, ఈగలతో జనాలు అవస్థ
● పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఉత్తమ మునిసిపాలిటీగా పేరొందిన ఎమ్మిగనూరులోని పలు ప్రాంతాల్లో ఇళ్ల మధ్య మురుగు పేరుకుపోయింది. దాంతో కాలనీలు కంపు కొడుతున్నాయి. ఓ వైపు దుర్వాసన .. మరోవైపు దోమల మోతతో ఆయా కాలనీల వాసులు నానా అవస్థ పడుతున్నారు. పట్టణంలోని హబిబుల్లా కాలనీ, అలాగే పలు కాలనీలు ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్నాయి. కానీ నేటికీ సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు లేవు. తమకు కనీస సౌకర్యాలు లేవని కాలనీవాసులు వాపోతున్నారు. గతంలో డ్రైనేజీ పనుల కోసం భూమి పూజ చేసి చేతులు దులుపుకున్నారు. కానీ ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదు. దాంతో ఇళ్లమధ్యనే మురుగు నిలుస్తోంది. ఇళ్ల పునాదులు దెబ్బ తింటున్నాయని వాపోయారు. వేసవి కాలంలోనే ఇలా ఉందంటే.. ఇక వర్షాకాలంలో తమ పరిస్థితి మరింత దయానీయంగా ఉంటుందని కాలనీవాసులు వాపోయారు. మునిసిపల్ అధికారులు, పాలకులు స్పందించి సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



మురుగుపై వాలిన దోమలు



ఇళ్ల మధ్య నిలిచిన మురుగు

ఆరుబయట నిలబడలేం



పదేళ్లుగా తాము ఇక్కడ నివాసం ఉంటున్నాం. కాలనీలో డ్రైనేజీలు లేవు. తాగునీటి సౌకర్యం లేదు. సాయంత్రం ఇంటిముందు కూర్చో లేని పరిస్థితి. దోమల బెడద అధికంగా ఉంటోంది. పాములు ఇళ్లలోకి వస్తున్నాయి, అధికారులు స్పందించి డ్రైనేజీలు నిర్మించాలి.

– ఈశ్వరమ్మ, కాలనీవాసి

రెండు సార్లు భూమి పూజ చేశారు



మా కాలనీలో డ్రైనేజీలు లేవు. గత పాలకులు రెండుసార్లు భూమి పూజ చేశారు. కానీ పనులు మాత్రం ప్రారంభించలేదు. మురుగు ఇళ్లముందు నిలుస్తూ దుర్వాసన వస్తోంది. ఇళ్ల మధ్య సంవత్సరాల నుంచి మురుగునీరు నిలిచిపోవడంతో పునాదులు దెబ్బతింటున్నాయి. అధికారులు స్పందించి డ్రైనేజీలు నిర్మించాలి.

– భరత్‌రాజు, కాలనీవాసి